క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన కేఎంసీ కమిషనర్



జడ్జికి పూలమొక్క అందిస్తున్న కమిషనర్

ఖమ్మంలీగల్: నూతనంగా ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ అగస్త్య శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జికి పూల మొక్కను అందజేశారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: నూతన కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అభిషేక్ అగస్త్యను బీజేపీ నాయకుడు, 8వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి ధనియాకుల వెంకటనారాయణ, వాగ ధాని చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

లారీలు ఆపి డబ్బు వసూళ్లు

నేలకొండపల్లి: యువత మద్యం మత్తులో లారీలు ఆపి డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నేలకొండపల్లి శివారులో శుక్రవారం అర్ధరాత్రి కొందరు యువకులు లారీలను ఆపి డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. ఇంతలోనే పోలీసుల పెట్రోలింగ్ వాహనం రావడంతో వారు పరారైనట్లు తెలిసింది. అయితే, ఓ యువకుడు కింద పడగా గాయాలు కావడంతో పోలీసులు ఆయనను అదుపులోకి విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై టి.నాగరాజును వివరణ కోరగా వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

హిజ్రాలకు కౌన్సెలింగ్

నేలకొండపల్లి: మండలంలోని కూసుమంచి రహదారిలో హిజ్రాలు వాహనాలు ఆపి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు హిజ్రాలను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక నుంచి మండలంలో ఎక్కడైనా వాహనాలు ఆపి డబ్బులు అడిగితే సహించేది లేదని హెచ్చరించి పంపించారు.

నేడు 'నా పాట పంచామృతం'

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గాన గంధర్వుడు, పద్మభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం 78వ జయంతి సందర్భంగా ఆదివారం 'నా పాట పంచామృతం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కళాభిమానులు, కళాకారులు, సాహితీవేత్తలు, సంగీత ప్రియులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి శేషు, కోకన్వీనర్, రచయిత, దర్శకులు ఎం. ప్రసాద్, మొగిలిగుణకర్‌లు తెలిపారు.

నేడు కరెంట్ కోత

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ వీవీపాలెం ఫీడర్, 11 కేవీ వీవీపాలెం పారిశ్రామిక ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వీవీపాలెం, 12 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పారిశ్రామిక ఫీడర్ల పరిధిలోని వీవీపాలెం, నూతన కలెక్టరేట్ సముదాయం, జీఆర్ఆర్ శ్రీనివాసమ్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: నాసా ఆధ్వర్యాన నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో నగరంలోని మమత రోడ్‌లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీదర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించాక మాట్లాడారు. డీజీఎం చేతన్ మాదూర్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాళ్లు శర్మ, నాగప్రవీణ, వైస్ ప్రిన్సిపాళ్లు రామకృష్ణారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	కల్కి
సాయిరాం	కల్కి
ఆదిత్య	కల్కి, మహారాజ
శ్రీనివాస	కల్కి

- ఖమ్మంగాంధీచౌక్

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/కామేపల్లి/కూసుమంచి/ఖమ్మంరూరల్ : రైతులకు అందించే రైతు బంధు సాయం కోసం ప్రభుత్వం రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. ఈమేరకు అధికారులు రైతు వేదికలో సేకరణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈమేరకు శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షకసేవా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో సాగు చేసే ఎకరాలకు మాత్రమే అందించాలని కొందరు, 10 ఎకరాల్లోపు అందించాలని మరికొందరు పేర్కొనగా.. 5 ఎకరాలకే పరిమితం చేయాలని ఇంకొందరు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సంఘం ఎండీ సాకేత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీదేవి, సంఘం డైరెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెం రైతు వేదికలో జరిగిన వీవీపాలెం సహకార సంఘం అభిప్రాయ సేకరణ సమావేశంలో 10 ఎకరాల వారికి ఇవ్వాలని, నీరు లేక బీడు భూములుగా ఉన్న పొలాలకు సైతం సాయం అందించి ఆదుకోవాలని కోరారు. సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, సీఈఓ తిరుపతిరావుతో పాటు వ్యవసాయశాఖ, జిల్లా సహకార శాఖ నుంచి వచ్చిన అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా కామేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల పాల్గొనగా.. 10 ఎకరాల లోపు రైతులకు రైతుబంధు ఇవ్వాలని రైతులు అభిప్రాయపడ్డారు. సొసైటీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.అంతేకాక కూసుమంచిలోని రైతు వేదికలో కల్లూరిగూడెం సహకార సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో సహకార శాఖ అధికారి పాత్యానాయక్ రైతుల నుంచి అభిప్రాయాలు స్వీకరించగా.. రైతు భరోసా 10 ఎకరాల వరకు కొనసాగించాలని కొందరు, 5 ఎకరాల వరకు సరిపోతుందని మరి కొందరు రైతులు అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ సమావేశంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామిరెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ అఖిల బేగం, కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, ఏఓ , తదితరులు పాల్గొన్నారు. అంతేకాక రూరల్ మండలంలోని చినతండాలో గల ఏదులాపురం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎక్కువ మంది రైతులు సాగుభూములకు రైతు భరోసా పది ఎకరాలకు వరకే ఇవ్వాలని తెలిపారు.



కూసుమంచి: రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న అధికారులు

లైబ్రరీ వద్ద నిరుద్యోగుల ధర్నా..

ఖమ్మంగాంధీచౌక్: ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల భర్తీకోసం విడుదల చేసిన డీఎస్సీ షెడ్యూల్‌నురాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతులు కల్పించిన నేపథ్యాన ఖాళీలను పెంచి 25 వేల పోస్టులతో మరో మూడు నెలలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్-2,3 పోస్టులను కూడా పెంచాలన్నారు. ఉద్యోగాల భర్తీలో పలు డిమాండ్లపై రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో నిరుద్యోగి మోతీలాల్ నిరాహార దీక్షకు నిరుద్యోగులు మద్దతు పలికారు. ఈ నేపథ్యాన కేంద్ర గ్రంథాలయం, ప్రైవేటు స్టడీ సెంటర్లలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు ఫ్లెక్సీలు, ఫ్లకార్డులతో ధర్నా కార్యక్రమంలో పాల్గొని నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు సిద్ధూ యాదవ్, వెంకటేష్, రమేష్, వీరబాబు, జగదీష్, అశోక్, సాయి నరేష్, మురళి, రవి, ప్రసాద్, కొండల్‌రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయం వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి

ఖమ్మం లీగల్: త్వరలో అమల్లోకి రానున్న నూతన చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించేందుకు శనివారం ఖమ్మంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బ్రిటీష్ కాలంనాటి ఇండియన్ పీనల్ కోడ్ 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యం చట్టం పేరుతో రానున్న చట్టాల్లోని ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం ఐఏఎల్ జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావుతో పాటు దుస్సా జనార్దన్‌రావు, ఓరుగంటి శేషగిరిరావు, పి.పట్టాబి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్‌తో పాటు పి.అమర్‌చంద్, జీ.వీ.లక్ష్మీనారాయణ, షేక్ నస్రీన్, కొల్లి సత్యనారాయణ, ఏడునూతల శ్రీనివాసరావు, బిచ్చాల తిరుమలరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, ఎం.డీ.పర్వేజ్, ఎం.సతీష్, రాకేష్, మధు, టి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

ఖమ్మంమయూరిసెంటర్: ఇల్లెందులో తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మూడు రోజుల నుంచి విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్న కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించి వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య కోరారు. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను ఎన్నికల పేరుతో గత మూడు నెలలుగా ఆదివారాలు సైతం పనిచేయించారని, ఎన్నికలు అయ్యాక కూడా స్పెషల్ డ్రైవ్ పేరుతో రెండు పూటలా పని చేయించారని తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ మార్చిలోనే అయిపోయినా డబ్బులు చెల్లించకుండా జీతం నుంచి కట్ చేస్తున్నారని అన్నారు. పాలకవర్గం సమస్యను పరిష్కరించలేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జెట్టి గురవయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కె.శ్రీనివాస్, కంకణాల శ్రీనివాస్, దున్న గురవయ్య, కిన్నెర నారాయణ, వీరబాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'గ్రానైట్' సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రానైట్ సమస్యలు, సబ్సిడీలు, స్లాబ్ సిస్టం తదితర వాటిని ఎమ్మెల్యేకు వివరించగా.. ఆయన గ్రానైట్ పరిశ్రమల మనుగడకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉప్పల వెంకటరమణ, పాడిబండ్ల యుగంధర్, పారా నాగేశ్వరావు, రాకేష్, టైల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సభ్యులు ఉన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ సహజం



అరుణకుమారి సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి



హరినారాయణరెడ్డి దంపతులను సన్మానిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్, న్యాయమూర్తులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంసహకారనగర్/రఘునాథపాలెం/ఖమ్మంలీగల్/కామేపల్లి : ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని పలువురు వక్తలు కొనియాడారు. ఈమేరకు శనివారం రాత్రి నగరంలోని వైరారోడ్ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ హోదాలో పదవీ విరమణ పొందిన అద్దంకి అరుణకుమారి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ.. అరుణ కుమారి వివిధ బ్యాంకు బ్రాంచ్‌ల్లో 32 ఏళ్ల పాటు అంకిత భావంతో పనిచేసి తన పదవులకు వన్నె తెచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ లింగస్వామి, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రవీంద్ర, ఇబ్రహీం, వైరారోడ్ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ లింగాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ సూపరింటెండెంట్లు చెన్నాప్రగడ సత్యనారాయణ, డి.తిరుమలాచారి, హౌజింగ్ ఏఈ జి.శోభన్‌బాబులు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు. అదే విధంగా రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేమిశెట్టి మోహన్‌దాస్ పదవీ విరమణ కార్యక్రమాన్ని పాఠశాల ప్రాంగణంలో నిర్వహించగా.. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ మోహన్‌దాస్- సుగుణ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్ఎం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. అంతేకాక కుటుంబ న్యాయస్థానం పాలనాధికారిగా పనిచేస్తున్న హరినారాయణరెడ్డి శనివారం పదవీ విరమణ పొందగా.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఉమాదేవి, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి అర్చనాకుమారి, ముఖ్య పరిపాలనాధికారి హరికృష్ణ, సెంట్రల్‌నాజర్ రాధేశ్యామ్, సిస్టమ్ అధికారి ఓంకార్‌తో పాటు మంచర్ల వెంకటేశ్వర్లు, సుధాకర్, మధు, వేణు తదితరులు పాల్గొన్నారు. అలాగే కామేపల్లి స్థానిక రైతువేదికలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది సునిల్‌రెడ్డి, సత్రు, ఝాన్సీ, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల నిరసన

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన 10 మంది రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో గత 20 రోజుల క్రితం వాటికి మరమ్మతులు చేయాలని విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఈమేరకు శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసనకు దిగారు. రైతులు నారు మడులు పోసుకున్న వాటికి నీరందక ఎండిపోతున్నాయని, ఇలా అయితే మరల అప్పుల పాలై ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని మండిపడ్డారు. ఇకనైనా రైతుల పట్ల విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయాలని, లేనిపక్షంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు.

ఎట్టకేలకు దేవాలయ భూముల వేలం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ భూములు ఎట్టకేలకు ఐదోసారి వేలం పాట ఖరారైంది. శనివారం స్థానిక దేవాలయంలో ఈఓ కె. శ్రీకాంత్ ఆధ్వర్యాయన దేవాలయం ఆవరణలో వేలం పాట నిర్వహించగా.. గత నాలుగు పర్యాయాలుగా తమకు పంటలు పండలేదని రైతులు ఆరోపించడంతో వేలంపాట వాయిదా వేశారు. ఎట్టకేలకు దేవాలయానికి చెందిన మొత్తం 20 ఎకరాలను ఆరుగురు రైతులు ఎకరానికి దాదాపు రూ.8 వేల చొప్పున ఐదెకరాలకు కలిపి రూ.1.60 లక్షలు పాడారు. గత వేలం పాటకు రూ.10 వేల వరకు తగ్గింది. అనంతరం శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయానికి చెందిన 3.23 ఎకరాల కౌలుకు వేలంపాట నిర్వహించగా రెండోసారి కూడా ఎవరూ పాల్గొనలేదు.

కరివేద సాగుతో అధిక దిగుబడి

కామేపల్లి: రైతులు కరివేద సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల అన్నారు. శనివారం మండలంలోని పత్తి, కరివేద సాగు, వరి పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ రైతు సాగు చేసిన పంటల వివరాల నమోదును వేగవంతం చేయాలని ఏఈఓలకు సూచించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగించాలన్నారు. ఏఓ తారాదేవి, ఏఈఓ బానోత్ శ్రీకన్య, మహేష్, జగదీశ్వర్, కిన్నెర ప్రతిభ, జి.ఉష, షేక్ మున్నీ, రైతులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ నూతన కమిటీని శనివారం స్థానిక లైన్స్ భవనంలో ఎన్నుకున్నారు. లయన్స్ ప్రతినిధి కొత్త సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా పెసర ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా శ్యామల శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా సుంకు నాగిరెడ్డిలు ఎన్నికయ్యారు. తొలుత క్లబ్ కార్యదర్శి బైరెడ్డి పుల్లారెడ్డి కార్యదర్శి నివేదికను వినిపించగా.. సమావేశంలో పెద్దపల్లి సుధాకర్, వి.శివప్రసాద్, డాక్టర్ ఎ.రాఘవరెడ్డి, ఎం.మురళీధర్‌రావు, డీపీసీ రావు, శాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం చెరువులోకి మురుగునీరు చేరనివ్వొద్దు

ఖమ్మంఅర్బన్: నగరంలోని కొత్తగూడెం ధంసలాపురం పెద్దచెరువులో ఇటీవల చేపలు మృతి చెందిన విషయంపై శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మత్స్యకారులు కలిసి తమ గోడును చెప్పుకున్నారు. ఈమేరకు మంత్రి తుమ్మల మత్స్య శాఖ అధికారులను పిలిపించి నగరంలోని కలుషిత మురుగునీరు చెరువులోకి పోకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు, మత్స్య సహకార సంఘం సభ్యులు, కొత్తగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: ఇటీవల ఇచ్చిన పదోన్నతుల్లో భౌతికశాస్త్ర సబ్జెక్టును మరచిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, వారికి తక్షణమే పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ నాయకులు డీఈఓ సోమశేఖరశర్మకు విన్నవించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడుతూ.. జెడ్పీ పాఠశాలలో ఏడు, ప్రభుత్వ పాఠశాలలో నాలుగు భౌతికశాస్త్ర ఖాళీలున్నాయని, వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. నాయకులు కె. వెంకటేశ్వర్లు, వీరబాబు, ఎం.నాగిరెడ్డి, వీరబాబు, నరసింహారావు ఉన్నారు.

'మతం పేరుతో కాలయాపన చేసిన మోదీ'

ఖమ్మంమయూరిసెంటర్: గత పదేళ్లలో మానవుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసి, దేశ ప్రజలు కోసం చేసేదేమీ లేక మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ మోదీ కాలయాపన చేశాడని రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల రవి ఆరోపించారు. సీపీఎం ఖమ్మం టూ కమిటీ ఆధ్వర్యాన సుందరయ్య భవన్‌లో కొనసాగుతున్న రెండు రోజుల రాజకీయ శిక్షణా తరగతుల్లో 'బీజేపీ మతోన్మాదం'అనే అంశంపై రవి బోధించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, మాజీ కౌన్సిలర్ నర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి..

ఖమ్మంరూరల్: నేటి యువత రాజకీయాల్లోకి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన రూరల్ మండల సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, బుగ్గవీటి సరళ, బి.వెంకటేశ్వరరావు, పి.మోహన్‌రావు, పి.సుమతి, సంగయ్య, పి.వెంకటరమణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జల్లెపల్లిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లిలో డెంగీ జ్వరాల భయంతో గ్రామంలో ఎంపీఓ రాజేశ్వరి ఆధ్వర్యాన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి వచ్చిన కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, హెచ్ఈఓ వెంకటరెడ్డిలు ఇంటింటికి తిరిగి కూలర్లు, టైర్లు, ఇతర నీటి నిల్వ ప్రదేశాలలో నీరు నిల్వలేకుండా చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జ్వర బాధితులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ హెచ్ఈఓలు నరేష్, రామయ్య, ఏఎన్ఎం నాగమణి తదితరులు పాల్గొన్నారు.



దోమల లార్వాలను గుర్తిస్తున్న వైద్యాధికారులు

హుండీలో నగదు చోరీ

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంలో శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయంలో శనివారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీ పగలకొట్టి నగదు ఎత్తుకెళ్లారు. కాగా, పోలీస్‌స్టేషన్ సమీపాన ఉన్న ఆలయంలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమమే ధ్యేయం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్యవైశ్యుల ఐక్యత, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయనున్నట్లు మాజీ కౌన్సిలర్, ఆర్యవైశ్య సంఘం నగర మాజీ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్ తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ సంఘం నగర అధ్యక్షుడిగా 2015 నుం రుట 2017 వరకు పనిచేసిన తాను అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. ఈమేరకు ఆదివారం జరిగే సంఘం ఎన్నికల్లో మరోమారు తనను అధ్యక్షుడిగా గెలిపించాలని ఆర్యవైశ్యులను కోరారు. ఈ సమావేశంలో కందిబండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మంఅర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న టూవీలర్ మెకానిక్ తోట జగదీష్‌కు టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం రూ.21 వేల ఆర్థిక సాయం అందించినట్లు సంఘం అధ్యక్షుడు వంగాల కొండలరావు తెలిపారు. గత 25 ఏళ్లుగా మెకానిక్‌గా పని చేస్తూ అనారోగ్యంతో గత 2 నెలలుగా మంచానికే పరిమితమైన జగదీష్, ఆయన కుటుంబాలనికి అండగా ఉండాలని ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేష్, మురళి, సతీష్, శ్రీను, బ్రహ్మం, గంగరాజు, లాలయ్య, వెంకట్, హమీద్, ఉపేందర్, చారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం